
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 17.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సీనియర్ల సంగతేంటి?

ఉమ్మడి పశ్చిమ గోదావరి రాజకీయాల్లో ఎందరో నాయకులు తమకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. వారిలో కొందరు తటస్థంగా, మరికొందరు సైలెంట్‌గా మిగిలారు. ఇంకొందరు మంత్రి స్థాయి హోదాలను అనుభవించి, రాజకీయ సీనియార్టీ సాధించి ఆయా పార్టీల్లోనే కొనసాగుతున్నారు. పార్టీ సీటు ఇస్తే పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇలా తెలుగుదేశం పార్టీలో ప్రముఖ నేతలుగా గుర్తింపు పొందిన పలువురి నేతల తాజా రాజకీయ పరిస్థితిపై ప్రత్యేక కథనం.



కొత్తపల్లి సుబ్బారాయుడు పీతల సుజాత కేఎస్ జవహర్ అంజిబాబు ఈలి నాని

- మాజీ మంత్రులు కొత్తపల్లి, సుజాత, జవహర్‌లకు చోటెక్కడ ?
- భీమవరాన్ని ఏలిన అంజిబాబు, తాడేపల్లిగూడెంలో ఈలి నానిల రూటెటు ?
- ఎన్నికల యుద్ధంలో వీరి పాత్ర ఏమిటి ?

తెలుగుదేశంలో చక్రం తిప్పిన నేతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా దశాబ్దాల తరబడి జిల్లాలో ఏకచత్రాధిపత్యం సాధించిన వారిలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కొత్తపల్లి సుబ్బారాయుడు ఒకరు. ఎన్టీఆర్ హయాం నుంచి ఆయన రాజకీయాల్లో రాణించారు. పలుసార్లు ఎమ్మెల్యేగా రాణించి జిల్లా అంతటా పట్టు బిగించి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత వహించారు. రానురాను రాజకీయ సమీకరణలకు అనుగుణంగా ఆయన తెలుగుదేశం నుంచి తప్పుకుని కాంగ్రెస్‌లో చేరారు. కొన్నాళ్లపాటు ఆ పార్టీలో కొనసాగిన అనంతరం వైసీపీలో చేరారు. చాన్నాళ్లపాటు ఆ పార్టీలోనే చక్రం తిప్పేందుకు ప్రయత్నించారు. స్థానిక రాజకీయాలు గిట్టక ఆయన అసంతృప్తి గళం విప్పారు. అంతే.. అమాంతం వైసీపీ నుంచి ఆయనను వైదొలిగేలా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తపల్లి ఏ పార్టీ వైపు తొంగి చూడలేదు. ప్రత్యేకించి కాపు సామాజిక వర్గంలో విస్తృత పేరు ఉన్న ఆయనను ఆ రూపంలో వినియోగించుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. కొన్నాళ్లపాటు ఆరోగ్యం సహకరించకపోయినా క్రియాశీలక రాజకీయాల్లో కొత్తపల్లి తన పాత్ర పోషించారు. గడిచిన ఐదేళ్లల్లో ఆయన దాదాపు సైలెంట్‌గానే ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల వేళ ఆయన ఎక్కడైనా తిరిగి పోటీ చేస్తారా, లేదా అనేది తేల్చుకోవాల్సి ఉంది. కొత్తపల్లి వంటి సీనియర్ నేత సహకారం అందుకోవడానికి ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు అరంభమయ్యాయి. జనసేన సైతం కొత్తపల్లికి అండగా నిలబడుతుందని కొన్నాళ్లపాటు విస్తృత ప్రచారం సాగింది. ఆ తర్వాత ఇది కాస్తా నిలిచిపోయింది.

మాజీ మంత్రులది తలోదారి

చంద్రబాబు మంత్రి వర్గంలో మంత్రులుగా పనిచేసిన పీతల సుజాత, కె.ఎస్.జవహర్ ఇప్పటికీ ఎదురీదుతున్నారు. కొవ్వూరు రాజకీయాల్లో జవహర్ అసమ్మతిని ఎదుర్కొన్నారు. ఓ వర్గం ఆయనను పూర్తిగా వ్యతిరేకించింది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన కొనసాగనీయకుండా చేసింది. అధిష్ఠానం అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నియోజకవర్గ టీడీపీ నిర్వహణ బాధ్యతలను జవహర్‌ను కాదని ద్విసభ్య కమిటీకి అప్పగించారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా జవహర్‌ను నియమించారు. ఆయన ఆ బాధ్యతల్లో సక్సెస్ అయ్యేలా నిరంతరం ప్రయత్నించారు. ఇప్పుడు తాజాగా జవహర్‌కు ఎక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారనే దానిపై సస్పెన్స్ నెలకొంది. తాను కొవ్వూరు నుంచి పోటీ చేయడానికే సిద్ధమని, దానికి అవకాశం కల్పించాల్సిందిగా అధినేత చంద్రబాబుకు పదేపదే విన్నవించారు. ఆయన అనుచరులు సైతం పట్టుపడుతూనే ఉన్నారు. అధిష్ఠానం ఇప్పటి వరకు జవహర్‌కు ఎక్కడ అవకాశం ఇవ్వబోతున్నారనే దానిపై సంకేతాలు ఇవ్వలేదు.మరో మాజీ మంత్రి పీతల సుజాత చింతలపూడి నియోజకవర్గం నుంచి ఒకప్పుడు హల్‌చల్ చేశారు. టీడీపీ అధిష్ఠానానికి చేరువయ్యారు. ఆ నియోజకవర్గంలో టీడీపీ వర్గాల మధ్య విబేధాలు పొడచూపడంతో 2019 ఎన్నికల్లో ఆమెను కాదనుకుని డాక్టర్ రాజారావుకు అవకాశం ఇచ్చారు. ఆయన ఓటమి చెందడంతోపాటు తదుపరి మృతి చెందారు. అప్పటి నుంచి చింతలపూడి నియోజకవర్గంలో సుజాతకు గాని, ఇంకొకరికి గాని నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించలేదు. సుజాత వీలు చిక్కినప్పుడల్లా చింతలపూడి నియోజకవర్గంలో వివాహ వేడుకలకు హాజరుకావడం, మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్నారు. ఎన్నికల వేళ సుజాతను వీలైతే కొవ్వూరు అసెంబ్లీ స్థానానికి పంపుతా రని కొందరు ప్రచారం చేసినా అధినాయకత్వం నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడలేదు. అధిష్ఠానం ఆలోచనకు అనుగుణంగా పార్టీకి కట్టుబడి ఉంటానని ఆమె చెబుతున్నారు.

అంజిబాబు ఎక్కడ ?

2014 ఎన్నికల్లో భీమవరం నుంచి ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచిన పులపర్తి ఆంజనేయులు(అంజిబాబు) 2019 అనంతరం క్రియాశీలక రాజకీయాలకు దాదాపు దూరంగా నిలిచారు. వ్యక్తిగతంగా క్రమశిక్షణ కలిగిన ఆయన కొన్ని కీలక వ్యవహారాల్లో ముక్కుసూటిగా వ్యవహరించారు. మాజీ మంత్రి ఘంటా శ్రీనివాస్‌తో బంధుత్వం ఉన్న ఆయన ఘంటా బాట ఎటు అయితే ఆయన అటేనంటూ అంజిబాబు అనుచరులు కొన్నాళ్లపాటు ప్రచారం చేశారు. రానురాను టీడీపీ వ్యవహారాల్లో ఆయన పాత్ర అంతంత మాత్రంగానే మిగిలింది. భీమవరం రాజకీయాల్లో అంజిబాబు తిరిగి పుంజుకుంటారని భావించినా గతంలో ఈ నియోజకవర్గం నుంచి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పోటీ పడడంతో అప్పట్లో అంజిబాబుకు పోటీ చేసే ఛాన్స్ ఇవ్వలేదు. దీని దరిమిలా విశాఖ జిల్లాలో ఘంటా శ్రీనివాస రావు టీడీపీ వ్యవహారాల్లో జోరు పెంచారు. తదనుగుణంగానే భీమవరం లోను అంజిబాబు కొంత వేగంగా రాజకీయాల్లో ముందుకు కదులుతారని అంతా ఊహించారు. అయితే ఇప్పటివరకు ఆయన భవిష్యత్ మార్గం ఏమిటనేది నిర్ధారించలేదు.

ఈలి నాని రూటెటు..?

ఒకప్పుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరపున తాడేపల్లిగూడెం నుంచి ఎన్నికైన ఈలి నాని చాన్నాళ్లపాటు అక్కడి రాజకీయాల్లో వెలుగొందారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఆయన అక్కడ నిలదొక్కుకోవడానికి ప్రయత్నించారు. ప్రత్యేకించి అక్కడ ఉన్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తాను, తన కేడర్ సైతం క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగేలా ప్రయత్నించారు. కొంత కాలంగా కొన్ని రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు తగిన ప్రాధాన్యత వస్తుందని అందరూ ఊహించారు. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. కాని మాజీ ఎమ్మెల్యే నాని అటూ ఇటూ తేల్చుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి జరగబోయే ఎన్నికల్లో ఆయన ఇమేజ్‌ను ప్రధాన పార్టీల్లో ఏ పార్టీ అందుకుని లబ్ధి పొందబోతుందనే దానిపై సస్పెన్స్ నెలకొంది.

2 నుంచి ఇంటర్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్/ ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 19 :ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరు ఆర్ఐవో నేతృత్వంలో పరీక్షలు జరుగగా ఈ ఏడాది నుంచి మార్పులు చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత తొలిసారిగా కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ పరీక్షలను నిర్వహించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఆ ప్రకారం పరీక్షల నిర్వహణ మొదలుకుని సిబ్బంది నియామకాలు, మూల్యాంకనం తదితర పనులన్నీ ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే జరుగుతాయి. మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలు జరుగుతాయి. పశ్చిమగోదావరి జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ డీఐఈవో కేవీ సత్యనారాయణకు బాధ్యతలను అప్పగించారు. ఏలూరు ఆర్ఐవో సూచనలతో పరీక్షల నిర్వహణ చేస్తామని సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో 121 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉండగా ఇంటర్ ప్రథమ సంవత్సరం 17,806 మంది విద్యార్థులు,ద్వితీయ సంవత్సరం 18143 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. సైన్స్ సబ్జెక్టుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఒకేషనల్ విభాగంలో ఫిబ్రవరి 5 నుంచి జనరల్ విభాగంలో 10 నుంచి జరుగుతాయి. ప్రాక్టికల్స్‌కు ఒకేషనల్ సబ్జెక్ట్‌లో ప్రథమ సంవత్సరం 1,789 మంది, ద్వితీయ సంవత్సరం 1,781 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జనరల్ విభాగంలో 11,797 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

రబీకి నీటి ఇబ్బంది రాకుండా చూడండి

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీనివాసరావు



భీమవరం, జనవరి 19 : రబీ సాగులో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసు కోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు సంబంధిత అధికారులను కోరారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు సాగునీరు అందించాలని కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సాగునీరు, ధాన్యం బకాయిలపై చర్చించారు. ఏప్రిల్ 10న కాలువలు కట్టివేస్తామని చెపుతు న్నారని కానీ గతేడాది వరదలు, అధిక వర్షాల కారణంగా నారుమడులు పోసుకునేందుకు నాట్లు వేసేందుకు ఆలస్యం ఆయిందని దీనిని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30 వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, నీటి పారుదల శాఖ ఈఈ దక్షిణామూర్తి, సలహామండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మురళీకృష్ణ,ఉండి కేవీకే కోఆర్డినేటరు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్ ద్వారా సమస్యల పరిష్కారం

భీమవరం, జనవరి 19 : కలెక్టరేటులోని జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ మండలాలు నుంచి వచ్చిన ఉద్యోగుల అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణరెడ్డి స్వీకరించారు. ఉద్యో గులు సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రియింబర్స్‌మెంట్ సమస్యలపై ప్రతినెల మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌డేలో అర్జీలు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 14 దరఖాస్తులు అందినట్టు డీఆర్వో తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల అధికారి అప్పారావు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.శోభారాణి, కలెక్టరు కార్యాలయం ఏవో అప్పారావు పాల్గొన్నారు. నరసాపురం ఆర్డీవో కార్యాలయంలో ఎరుబండి సునీత డిప్యుటేషన్‌పై ఆఫీసు సబార్డినేటుగా పనిచేస్తున్నారు. తాను అంధ ఉద్యోగినని తనని తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేయాలని కోరారు. భీమవరం అసిస్టెంటు గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసులో ముదిగొండ శ్యామలాదేవి ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. 2004 సంవత్సరంలో జాబు వచ్చిందని తనకు పదోన్నతి, బదిలీ చేయవలసిందిగా కోరారు. వీరవాసరం మండలం నవుడూరు పంచాయతీ కార్యదర్శి వసంతవాణి ప్రసాదు తనకు అనారోగ్యం కారణంగా జూనియర్ అసిస్టెంటుగా పోస్టు మార్పు చేసి బదిలీ చేయాలని కోరారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామ సచివాలయ ఉద్యోగి నేతల నాగరాజును గతంలో 23 నెలల పాటు సస్పెండ్ చేశారు. ఆ సమయాన్ని సర్వీసులోకి తీసుకుని జీతం ఇప్పించాలని కోరారు.

టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారో ?



- జనవరి గడువు మీరినట్టే
- వడ్డీలు చెల్లిస్తూ ప్రభుత్వం కాలయాపన
- వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు
- అయోమయంలో లబ్ధిదారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో కేంద్రం అమలు చేస్తున్న అర్బన్ హౌసింగ్ ఇళ్ల మంజూరులో రాష్ట్రప్రభుత్వం విఫలమైంది. తెలుగుదేశం హయాంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లను ఇప్పటిదాకా లబ్ధిదారులకు అప్పగించలేకపోయింది. మూడో వంతు ఇళ్లను మాత్రమే తొలి విడతగా కేటాయించింది. రెండో విడతలో వంద శాతం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే స్తామంటూ గడువులు పెడుతోంది. జనవరిలో ఇచ్చేస్తామంటూ అధికార పార్టీ నేతలు ప్రకట నలు గుప్పించారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు మంజూరు చేశారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేసుకుంది. ఇళ్లు అప్ప గించేంత వరకు వాయిదాలు రికవరీ చేయకూడదంటూ బ్యాంకులకు ప్రభుత్వం సూచించింది. అప్పటిదాకా వడ్డీ చెల్లిస్తామంటూ బ్యాంకులకు భరోసా కల్పించింది. వాస్తవానికి ఇళ్లు అప్పగించినట్టయితే లబ్ధిదారులు వాయిదాలు చెల్లిస్తారు. ప్రభుత్వానికి వడ్డీ భారం తగ్గుతుంది. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేస్తూ వచ్చింది. తెలుగుదేశం హయాంలో ప్రారంభమైన ఇళ్లు అంటూ మూడేళ్లపాటు పాటు కాలయాపన చేసింది. నిర్మాణ ఏజన్సీలకు బకాయిలు చెల్లించలేదు. మౌలిక వసతులు కల్పించలేదు. ప్రభుత్వ తాత్సారం లబ్ధిదారులకు శాపంగా మారింది.

రంగులపైనే శ్రద్ధ

అర్బన్ హౌసింగ్ నిర్మాణ బాధ్యతలను ఏపీ టిడ్కో నిర్వహిస్తోంది. లబ్ధిదారుల పేరుతో మంజూరైన రుణాలు ఏపీ టిడ్కో ఖాతాలో జమకావాలి. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్‌లకు చెల్లించాలి. ప్రభుత్వమే రుణాల సొమ్మును వినియో గించుకుంది. మరోవైపు టిడ్కో ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం చేసింది. టీడీపీ హయాంలో పూర్తయిన ఇళ్లకు రంగులు మార్చడంలో మాత్రం శ్రద్ధ చూపింది. అందుకోసం జిల్లాలో కోట్ల రూపాయలు తగల బెట్టింది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో 19,176 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అందులో ఇప్పటిదాకా సుమారు 6,600 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు అప్పగించారు. అవికూడా తెలుగుదేశం హయాంలో పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు కూడా అప్పట్లోనే 75 శాతం నిర్మాణాలు పూర్త య్యాయి. మిగిలిన 25 శాతం నిర్మాణాన్ని పూర్తి చేయడంలో వైసీపీ విఫలమైంది.

లబ్ధిదారులకు ఊరట ఏదీ

టిడ్కో ఇళ్లను ఉచితంగా అందచేస్తామంటూ ఎన్నికల ముందు జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. కేవలం 300 చదరపు అడుగుల ఇళ్లను మాత్రమే ఉచితంగా కేటాయించింది. జిల్లాలో కేవలం 7,044 మంది లబ్ధిదారులు మాత్రమే ఉచితంగా ఇళ్లు పొందారు. అదే 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3 లక్షల రాయితీ ఇచ్చాయి. దీనివల్ల 8132 మంది లబ్ధిదారులకు చుక్కెదురైంది. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించారు. వాయిదా పద్ధతిలో రుణాల రికవరీకి బ్యాంకులు సిద్ధమవుతున్నాయి.

కంటి తుడుపు చర్యే

అందరికీ ఉచితంగా ఇళ్లు ఇస్తామంటూ ప్రకటనలు గుప్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కంటితుడుపు చర్యలతో సరిపెట్టారు. లబ్ధిదారులు చెల్లించే మొత్తంలో కొంత మొత్తాన్ని తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. అదికూడా నెరవేర్చకుండా మొండి చేయి చూపారు. ఏపీ టిడ్కో ఇళ్లలో 365 చదరపు అడుగులకు సంబంధించి లబ్ధిదారులు రూ. 50 వేలు చెల్లించారు. అందులో రూ. 25 వేలు తిరిగి ఇచ్చేస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చింది. 430 చదరపు అడుగులైతే లబ్ధిదారులు లక్ష చెల్లించాలి. అందులో రూ. 50 వేలు తిరిగి లబ్ధిదారులకు చెల్లిస్తామంటూ ప్రకటించింది. పూర్తి ఉచిత హామీని పక్కన పెట్టేసింది. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంలో తిరిగి ఇస్తామన్న సొమ్మును కూడా తిరిగి ఇవ్వలేదు. ఇలా అన్ని కోణాల్లోనూ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇళ్లు అప్పగించే పరిస్థితి ఉండదంటూ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

సి-కేటగిరీ ఇళ్లలో అదనపు వసూళ్లు

- మండలి చైర్మన్‌కు లబ్ధిదారుల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు

భీమవరం, జనవరి 19 : జగనన్న గృహ నిర్మాణంలో సి-కేటగిరి విభాగంలో నిర్మించే గృహనిర్మాణాలకు లబ్ధిదారుల నుంచి అదనంగా లక్షా 50 వేల వరకు వసూలు చేస్తున్నారని కొందరు లబ్ధిదారులు శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు దృష్టికి తీసుకువెళ్లారు. కేటగిరి-సి విభాగంలో ప్రభుత్వమే లబ్ధిదారులకు పూర్తిగా ఇళ్లు నిర్మించి ఇస్తుంది. అయితే ప్రభుత్వం అందిస్తున్న లక్షా 80 వేలు సరిపోవడం లేదని లక్షా 50 వేలు చెల్లించాలని కాంట్రాక్టరు ఒత్తిడి చేస్తున్నారని భీమవరం పట్టణ శివారు విస్సాకోడేరు లే-అవుట్‌లో లబ్ధిదారులు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై మోషేన్ రాజు శుక్రవారం స్పందించారు. ఇటువంటి వసూళ్లు సరికాదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేసిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు లేఖలు పంపినట్టు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

విస్సాకోడేరులో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ





కలెక్టరేట్‌లో వేమన చిత్ర పటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

22 లోపు ఓటర్ల జాబితా అభ్యంతరాలను పరిష్కరించండి

భీమవరం, జనవరి 19 : ఓటర్ల జాబితా అభ్యంతరాలను ఈనెల 22 లోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం కలెక్టర్లు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు అయ్యేంత వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. 2023 అక్టోబరు 28 డ్రాఫ్ట్‌రోల్ ప్రకటన తర్వాత వచ్చిన ఫామ్-6,7,8 క్లెయిమ్స్ అన్నింటిని విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించాలన్నారు. ప్రజా ప్రతినిధుల ఓటుహక్కు ఉందా లేదా తనిఖీ చేయాలన్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంద న్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్వోలు,ఈఆర్వోలు పాల్గొన్నారు. యోగి వేమన జయంతి పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతిని, తెలుగువారి కీర్తిని దశదిశలా తీసుకెళ్లిన మహాకవి వేమన అని అన్నారు.

బస్సులన్నీ సీఎం సభకే..

ప్రయాణికుల పాట్లు
7
కిక్కిరిసిన బస్టాండ్‌లు



అంబేడ్కర్‌కు అంగన్‌వాడీల వినతి

జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు ఆందోళన కొనసాగుతోంది. ప్రభుత్వం దిగి వచ్చేవరకు తమ నిరసనలు ఆగవని స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం తణుకు, పెనుగొండ, ఆచంట, నరసాపురం, పెనుమంట్ర, గణపవరం, ఆకివీడు, భీమవరం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, పాలకోడేరు, ఉండి, మొగల్తూరు, వీరవాసరం ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ధర్నా నిర్వహించారు. మరోవైపు పోస్ట్ ద్వారా అంగన్‌వాడీలకు జిల్లా అధికారులు నోటీసులు పంపారు,



తాడేపల్లిగూడెంలో మానవహారం చేపట్టిన అంగన్‌వాడీలు

ఏజెన్సీ పోలీసా..మజాకా !

- పేకాటలో దొరికిన సొమ్ము నొక్కేశారు..
- ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు



ఏలూరు క్రైం, జనవరి 19 : సంక్రాంతి పండుగ పేరు చెప్పి ఏజెన్సీ ప్రాంతంలోని కొంతమంది పోలీసు అధికా రులు, కానిస్టేబుళ్లు యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేలేరుపాడులో పేకాట శిబిరంపై జరిపిన దాడుల్లో పట్టుబడిన సొమ్మును కేసులో పూర్తిస్థాయిలో చూపించకుండా పక్కకు మళ్లించడంతో జూద గాళ్లే స్వయంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏజెన్సీ పోలీసా...మజాకా అంటూ ఆ ప్రాంత ప్రజలతో పాటు పోలీస్ శాఖలోనే చర్చించుకోవడం విశేషం. ఏజెన్సీ ప్రాంతా లకు ఉన్నతాధికారులు రావాలన్నా తమకు చెప్పే రావాలి.. అన్న ధీమా అక్కడ పోలీసులు వ్యక్తం చేస్తూ వారు అసాం ఘిక కార్యకలాపాలకు అనుమతులు ఇస్తున్నారనే ప్రచారం ఉంది. కుక్కునూరు, చీరవల్లి, వేలేరు గ్రామాల్లో జరిగిన కోడి పందేలకు తెలంగాణ ప్రాంతాలైన భద్రాచలం, పాల్వంచ, కొత్త గూడెం, మణుగూరు ప్రాంతాలకు చెందిన పలువురు జూద గాళ్ళు, కోడిపందేల రాయుళ్ళు భారీగా వాహనాల్లో తరలి వచ్చారు. ఈ వాహనాల వల్ల వేలేరులో పండుగ రోజున 108 వాహనం అర్ధగంట పాటు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకు పోయిందంటే అక్కడ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. ట్రాఫిక్‌ను నియంత్రిం చాల్సిన పోలీసులు దరిదాపుల్లోకి రాకపోవడంతో ప్రజలే క్రమబద్ధీకరణ చేసుకుని 108కు దారి ఇచ్చారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలోని కొంత మంది కానిస్టేబుళ్లు పండుగను అడ్డం పెట్టుకుని వసూళ్లకు పాల్పడారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేలేరుపాడు మండల కేంద్రంలో ఒక పొగాకు బ్యారన్‌లో ఈనెల 15వ తేదీ రాత్రి 15 మంది పేకాట ఆడుతుంటే ఒక పోలీస్ అధికారి తన సిబ్బందితో దాడి చేశారు. 88 వేల 80 రూపాయలు సీజ్ చేస్తూ వీడియో తీశారని పేకాట రాయుళ్లు చెబుతున్నారు. ఆ వీడియోను మధ్యలో ఆపి వారి వద్ద ఉన్న నగదు మూడు లక్షల 67 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారని సీజ్ చేసినట్టు చూపించ లేదని, పేకాట ప్రాంతంలో దాచిన మరో లక్షా 50 వేల రూపాయల నగదు కూడా అధికారి తీసుకున్నట్టు చెప్తున్నారు. ఒక నాయకుడు ఆ అధికారిని నిలదీయడంతో అతనికి రూ.40 వేలు వెనక్కు ఇచ్చేసినట్టు చెబుతున్నారు. మిగిలిన వాళ్లు తమ సొమ్మును అడగ్గా వారిని బెదిరించినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది నేరుగా జిల్లా పోలీస్ కార్యాల యానికి వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదును తపాలా సెక్షన్‌లో ఈనెల 18వ తేదీన ఇచ్చినట్టు సమాచారం. పండుగ నాడు అన్ని ప్రాంతాల్లో కోడిపందేలు, జూదాలకు అనుమతులు ఇచ్చి తమపై దాడి చేయడం ఎంతవరకూ న్యాయమంటూ వాపోతున్నారు. చట్టం అందరికి సమానంగా ఉండాలని ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలంటూ ఆ ఫిర్యాదులో పేర్కొంటు తెలుస్తోంది.

దిగొచ్చిన కూరగాయలు

తగ్గిన ధరలు



నరసాపురం, జనవరి 19: కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. నాలుగు రోజులుగా ఒక్కొక్కటి తగ్గుతూ వస్తున్నాయి. జిల్లాలో కూరగాయల పంట చేతికి రావడమే కారణమని చెబుతున్నారు. మరో పది రోజులు పోతే అన్నీ సాధారణ స్థితికి వస్తాయంటున్నారు. నిన్న, మొన్నటి వరకు కేజీ రూ 100 పలికిన వంకాయలు నేడు రూ.40కి దిగాయి. దొండకాయ కూడా ఇదే రకంగా తగ్గింది. రూ.80 వరకు అమ్మగా కేజీ రూ.30కి పడిపోయింది. దోసకాయలు కూడా కేజీ రూ 30కి వచ్చాయి. మొన్నటి వరకు రూ.60 అమ్మారు. బెండకాయ కేజీ రూ.60కి దిగింది. టమాట కేజీకి పది తగ్గింది. శుక్రవారం రైతుబజార్‌లో కేజీ రూ.30 పలికింది. క్యారెట్ కూడా కేజీ రూ.50కి దిగింది. చిక్కుడు కేజీ రూ.120 నుంచి తగ్గి రూ.70-80 మధ్య ఉంది. బీరకాయ మాత్రం కేజీ రూ.80 దగ్గరే ఉంది. కాకరకాయ కొద్ది చేదు తగ్గింది. కేజీ 80 నుంచి రూ.60కి పడింది. బీట్‌రూట్ కూడా రూ.50కి చేరింది. జిల్లాలో సిద్ధాంతం, కాకరపర్రు, గోపాలపురం,నరసాపురం, మొగల్తూరు, కందరవల్లి, కేదార్‌లంక, తదితర గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల పంట చేతికొస్తున్నాయి. మరో పది రోజులు పోతే బీర, చిక్కుడు, బెండ కూడా దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు ధరలు సగానికి సగం తగ్గే అవకాశం ఉంది.




కృష్ణంరాజు సతీమణి, వారసుడు ప్రభాస్‌కు హామీ ఇచ్చిన రాష్ట్రమంత్రులు (ఫైల్) (ఇన్‌సెట్‌లో) దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు

మనసున్న మారాజు

- వెండి తెరపై రెబల్‌స్టార్ కృష్ణంరాజు
- ఎంపీగా, కేంద్ర మంత్రిగా జిల్లా అభివృద్ధిపై ముద్ర
- నేడు జయంతి.. మొగల్తూరులో మెగా వైద్య శిబిరం
- మ్యూజియం, స్మృతివనం ఏర్పాటుకు మంత్రుల హామీ
- ఏడాదిన్నరైనా ఆ దిశగా పడని అడుగులు

మొగల్తూరు, జనవరి 19 : మొగల్తూరు ముద్దు బిడ్డ.. రెబల్‌స్టార్ కృష్ణంరాజు. మనసున్న మారాజుగా కీర్తిగడించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఉప్పలపాటి నారాయణమూర్తిరాజు లక్ష్మీదేవమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఆరుగురు కుమార్తెలు. మూడో సంతానంగా కృష్ణంరాజు 1940 జనవరి 20న మొగల్తూరులో జన్మించారు. విద్యాభ్యాసం మొగల్తూరు, నరసాపురం, హైదరాబాద్‌లో జరిగింది. రోడ్డు ప్రమాదంలో మొదటి భార్య మృతితో 1996లో శ్యామలాదేవిని రెండో వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మాజీ మంత్రి గాంధేయవాది, సీహెచ్‌వీపీ మూర్తిరాజు ద్వారా 1968లో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అంచలంచెలుగా ఎదిగి 183 సినిమాల్లో హీరోగా, విలన్‌గా విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు. కృష్ణంరాజు తొలుత కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లో వచ్చినప్పటికీ 1996 ప్రాంతంలోనే బీజేపీలో చేరారు. 1998 కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 1999 నర్సాపురం పార్లమెంట్ స్థానం నుంచి లక్షా 50 వేలపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంతో కేంద్ర మంత్రి పదవి వరించింది. ఐదేళ్లలో ఆయన పరిశ్రమలు, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేశారు. కృష్ణంరాజుకు మొగల్తూరు అంటే ఎంతో మమకారం. ఈ ప్రాంత ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకునేవారు. 1986 వరదలు, ఇతర విపత్తు సమయాల్లో ప్రజలకు సహాయం చేసి స్వగ్రామంపై తన అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి కేంద్ర గ్రామీణ సడక్ యోజన పేరుతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. 2004 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నరసాపురం నుంచి ఓటమి చెందారు. 2009లో ప్రజారాజ్యంలో చేరి, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత కాలంలో తనను రాజకీయంగా నిలబెట్టి కేంద్ర మంత్రి పదవి కూడా ఇచ్చి గౌరవించిన బీజేపీతో చివరి వరకు కొనసాగారు. 2022 సెప్టెంబరు 11న 82వ ఏట అనారోగ్యంతో కన్నుమూశారు.

ఏడాదిన్నరైనా కనిపించని స్మృతివనం

మొగల్తూరులో 2022 సెప్టెంబర్ 29న రాష్ట్ర ప్రభుత్వం కృష్ణంరాజు సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఆ సమయంలో 'కృష్ణంరాజు పేరిట పేరుపాలెం తీరంలో రెండు ఎకరాల భూమిలో మ్యూజియం ఏర్పాటు చేస్తాం. మొగల్తూరులో ఒక పంచాయతీ చెరువును వాకింగ్ ట్రాక్‌గా మార్చి స్మృతి వనం నిర్మిస్తాం' అంటూ మంత్రులు ఆర్‌కే రోజా, కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చీఫ్ విప్ ప్రసాదరాజు ప్రకటించారు. ఇది జరిగి ఏడాదిన్నర అవుతోంది. కాని, ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదు. కృష్ణంరాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా ? అని అభిమానులు, గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కృష్ణంరాజు జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మొగల్తూరు అబ్యాస్ కళాశాలలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కుమార్తెసాయి ప్రసిద్ద రెండు రోజులుగా మొగల్తూరులోనే ఉన్నారు. ఈ క్రమంలో స్థానికులు, అభిమానులు శ్యామలాదేవిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నారు. దేశ, విదేశాలకు చెందిన 30 మంది ప్రముఖ వైద్యులతో నిర్వహించే వైద్య శిబిరానికి మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై చిత్తశుద్ధి లేదు

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసవర్మ విమర్శ



మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

కాళ్ళ, జనవరి 19 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ విమర్శించారు. కాళ్ళ మండలం దొడ్డనపూడి, కాళ్ళకూరు, బొండాడ, ఎస్సీ బోసకాలనీ గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మీ పేరు పెట్టుకున్న విద్యా పథకానికి గతంలో ఉన్న అంబేడ్కర్ పేరే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

22న స్కూళ్లకు సెలవు ప్రకటించాలి

అయోధ్య రాముని ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించినా ఏపీలో మాత్రం 22న పాఠశాలలు పునః ప్రారంభించడం దారుణమన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు విద్యార్థులను తరలించాలని ఉద్దేశంతో సెలవులు పొడిగించినట్టే అయోధ్య రాముడి ప్రతిష్ఠ రోజున కూడా సెలవు ప్రకటించాలని బీజేపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, ఎస్.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అయోధ్యకు అనఘానంద భారతి స్వామిజీకి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక చూపుతున్న అనఘానంద భారతి స్వామీజీ

జీలుగుమిల్లి, జనవరి 19 : కామయ్యపాలెం దత్త సాయి ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీఅనఘానంద భారతి స్వామిజీకి అయోధ్య నుంచి ఆహ్వానం అందింది. అయోధ్యలో ఈనెల 22న జరిగే బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఆలయ ట్రస్ట్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన వెళ్లారు. దేశ వ్యాప్తంగా నాలుగు వేల మంది స్వామీజీలకు వచ్చిన ప్రత్యేక ఆహ్వానంలో జీలుగుమిల్లి మండలానికి చెందిన ఈయన ఒకరిగా నిలిచారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో షిర్డీలో మొట్టమొదటి సారిగా జరిగే అంతర్జాతీయ తెలుగు సాయి భక్త సమ్మేళనంలో పాల్గొని, అక్కడ కార్యక్రమాల్లో న్యాయ నిర్ణేతగా, వక్తగా ప్రసంగించేందుకు ఆహ్వానం అందుకున్నారు. అయోధ్యలో జరిగే కార్యక్రమం అనంతరం షిర్డీ వెళ్లనున్నట్టు తెలిపారు.



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉద్యాన వర్సిటీలో వేమన జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19: వెంకట్రామన్న గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మహాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్. సూర్య కుమారి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 19 : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో పేకాటాడుతున్న ఇద్దరిని ఎస్ఈబీ సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,010 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్ఐ మదీనాబాషా అరెస్టు చేసి వారి నుంచి రూ.4,750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌ల వద్ద బస్సులు రాగానే ఎక్కేందుకు పరుగులు తీస్తున్న ప్రయాణికులు

బస్సులన్నీ సీఎం సభకే..

విజయవాడలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణతోపాటు, అనంతరం సీఎం భారీ సభ ఏర్పాటు చేయడంతో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను సభకు తరలించడంతో శుక్రవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ డిపోనుంచి ఎన్ని బస్సులు సీఎం సభకు తీసుకువెళ్లాలో ముందుగానే నిర్ణయిం చుకున్నారు. ఈ మేరకు ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలనుంచి 100 బస్సులను, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 107 ఆర్టీసీ బస్సుల్లో జనాన్ని తరలించారు. మిగిలిన బస్సులను రద్దీ రూట్లలో నడిపి కొంతలో కొంతైనా సర్వీస్ ఇవ్వాలని అధికారులు భావించారు. కానీ బస్సులు చాలకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సివచ్చింది. చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

– ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం/ భీమవరంటౌన్

విజయవాడకు తరలివెళ్లిన ఆర్టీసీ బస్సులు

- అన్ని రూట్లలో కిక్కిరిసిన ప్రయాణాలు
- పండగ సమయాల్లో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



బస్సు సీటు కోసం ప్రయత్నిస్తున్న యువతి

విజయవాడలో సీఎం సభకు కార్యకర్తలను తరలించేందుకు ఆర్టీసీతో పాటు ప్రైవేట్ కళాశాల బస్సులను వైసీపీ నేతలు ఏర్పాటు చేశారు. జనసమీకరణకు ఏలూరు జిల్లాలోని మూడు డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు కేటాయించారు. దీంతో సరిపడా బస్సులు లేక ఉన్నబస్సుల్లో తమ గమ్యస్థానాలు చేరుకునేందుకు ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. తక్కువగా ఉండే రూట్లలో సర్వీసులను తగ్గించారు. ఆయా రూట్లలో ప్రయాణికులు ఏలూరు బస్టాండ్‌లో గంటలకొద్దీ ఎదురుచూడాల్సి వచ్చింది. ఏలూరు బస్టాండ్ నుంచి దాదాపు 50 వేల నుంచి 60వేల మంది ప్రయాణికులు పలు రూట్లలో ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికుల అవసరాలను పూర్తిగా తీర్చలేకే ఆర్టీసీ అద్దెబస్సులు నడుపు తోంది. గమ్యస్థానాలకు చేరుకునేందుకు వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కొత్త బస్టాండ్‌లో రద్దీగా ఉండడంతో బస్సులకోసం ఎగబడాల్సి వచ్చింది. చాలా సేపు వేచిఉన్న బస్సుల్లో సీట్లు దొరక్కపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ప్రైవేట్ వాహనాలు అదనంగా చార్జీలు పెంచి వసూలు చేశారు. ఇప్పటికే సంక్రాంతి ప్రత్యేక బస్సులు మాటచెప్పి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ఆర్టీసీకి అదనపు ఆదాయం చేకూరలేదు.



భీమవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో వేచివున్న ప్రయాణికులు

గంటసేపటికీ బస్సు రాలేదు

చింతలపూడి నుంచి ఏలూరు వచ్చా.. పని పూర్తయ్యాక తిరిగివెళదామంటే ఒక్క బస్సుకూడా లేదు. గంటసేపు ఎదురుచూశా. ఇక్కడ ఉన్న అధికారులను ఏది అడిగినా సమాచారం చెప్పడం లేదు. బస్సు వస్తుంది వస్తుంది అంటున్నారేగాని గంటసేపు వేచి వున్నా బస్సు రాలేదు.

– సుబ్రహ్మణ్యం,చింతలపూడి

ప్రజలను ఇబ్బంది పెడతారా?

సొంత పనిమీద ఏలూరు వచ్చా.. అక్కడి నుంచి తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వచ్చిన బస్సులో ప్రయాణికులు చాలా ఎక్కువగా ఉన్నారు. తరువాత బస్సుకు వెళదామంటే ఒక్కబస్సు కూడా రాలేదు. సీఎం సభకు బస్సులు తీసుకుని ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు.

– లక్ష్మణరావు, ఉంగుటూరు

సగం బస్సులు విజయవాడకే..

జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి సగం బస్సులను విజయవాడ సీఎం సభకే కేటాయించారు. మిగిలిన వాటితో కొన్ని సర్వీసులను కుదించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండుగ సమయం కావడంతో సొంత గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడు రోజులుగా ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో మొత్తం 68 బస్సులు ఉన్నాయి. కాగా చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి శుక్రవారం ఉదయం జనాన్ని తరలించడానికి 33 బస్సులను కేటాయించారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంకు పన్నెండు బస్సులు చింతలపూడి మండలానికి ఏడు బస్సులు, కామవరపుకోట మండలానికి 7 బస్సులు, లింగపాలెం మండలానికి 7 బస్సులు మాత్రమే కేటాయించారు.

భీమవరం బస్‌కాంప్లెక్స్ కిటకిట

పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 107 ఆర్టీసీ బస్సుల్లో సీఎం సభకు జనాన్ని తరలించడానికి ఉపయోగించడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యం అందక ప్రయాణికులు ఇబ్బందులు గురయ్యారు. ఉదయం నుంచి బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను, ఆటోలను పట్టుకుని ప్రయాణాలు కొనసాగించారు. కాంప్లెక్స్‌కు బస్సు వచ్చిందంటే చాలు ప్రయాణికులు ఎక్కేందుకు ఆపసోపాలు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా తగ్గాయని ప్రయాణికులు వాపోయారు. అధికారులు ముందస్తు సమాచారం అందించకపోవడంతో ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. జిల్లాలోని భీమవరం డిపో నుంచి 32 బస్సులు, తాడేపల్లిగూడెం డిపో నుంచి 22 బస్సులు, తణుకు డిపోనుంచి 31 బస్సులు, నరసాపురం డిపో నుంచి 22 బస్సులను విజయవాడకు పంపించారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేత 'కృష్ణా జిల్లా'



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా జిల్లా జట్టు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19: ఉప్పరగూడెంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భం గా నిర్వహించిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఉప్పరగూడెం-1 జట్టుపై విజయం సాధించింది. విజేత కృష్ణా జిల్లా జట్టుకు రూ.30 వేల నగదు, బహుమతి ట్రోఫీ, రన్నర్‌కు రూ.25 వేల నగదు బహుమతి అందించారు. మూడో స్థానంలో నిలిచిన ఉప్పరగూడెం-2 జట్టుకు రూ.15వేల నగదు బహుమతి, నాలుగో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టుకు రూ.10వేలు, బెస్ట్ టీంగా నిలిచిన భీమవరం జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతులు అందించారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు నవీన్ ఎంపిక



విద్యార్థి నవీన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ మోజెస్

పెదవేగి, జనవరి 19 : దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో మూడో ఏడాది దంతవైద్య విద్య అభ్యసిస్తున్న సీహెచ్.నవీన్ సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి ఆధ్వర్యంలో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈనెల 18న నిర్వహించిన సౌత్‌జోన్ చెస్ ఎంపిక పోటీల్లో ఎంపికయ్యాడన్నారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుచురాపల్లి భారతీయ దాస్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ చెస్ పోటీల్లో నవీన్ పాల్గొంటాడన్నారు. విద్యార్థిని కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, పీడీ ఎన్.నల్లయ్య అభినందించారు.

క్రైం కార్నర్

అప్పుల భారంతో కౌలు రైతు ఆత్మహత్య



గోపీకృష్ణ మృతదేహం

పోలవరం, జనవరి 19: అప్పుల భారంతో పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలవరం పంచాయతీ నూతనగూడెంకు చెందిన తిరుమలశెట్టి గోపీకృష్ణ (50) పోలవరంలో మూడు ఎకరాల పొలం కౌలుకు సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టం రావడం, ఇటీవల తుఫాన్‌కు పంట కోల్పోవడంతో రూ.7 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు కట్టలేక కొద్ది రోజులుగా ఇబ్బందిపడుతున్న అతడు శుక్రవారం పొలంలోనే పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని రాజమహేంద్రవరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మరొక చోటికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతడి భార్య సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

వీరవాసరం, జనవరి19 : మెంటేపూడిలో భూమిని దమ్ము చేస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ కొల్లా శివశంకర్ (26) మరణించాడు. శుక్రవారం మెంటేపూడిలోనే పంటచేలు దమ్ము చేయటానికి వెళ్ళి దమ్ము చేస్తుంగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. మట్టిలో పడిన శివశంకర్ అపస్మారక స్థితికి వెళ్లాడని స్థానికులు చెబుతున్నారు. దీనిని గుర్తించి రైతులు హుటాహుటిన వీరవాసరం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడని పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

ఆరుగురి దాడి.. కేసు నమోదు

ఆకివీడు, జనవరి 19: పాత కక్షల నేపథ్యంలో జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పెదకాపవరం శివారు గొల్లగూడెంకు చెందిన నిలపాల శ్రీనివాసరావును గంగుల సుబ్బారావు, సాయిప్రకాశ్, రామకృష్ణలతో పాటు మరో ముగ్గురు గురువారం రాత్రి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు తరలించగా శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తల్లీకూతుళ్లపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఉండి, జనవరి 19: ఓ విద్యార్థిని ప్రేమించలేదనే కారణంతో కొడవలితో తల్లీకూతుళ్లపై దాడి చేసి గాయపరిచిన కొణతం వెంకట కేశవ సుబ్రహ్మణ్యంను ఉండి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉండి ఇన్‌చార్జి ఎస్ఐ వీరభద్రరావు, ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాలివి.. ఉప్పులూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తనను ప్రేమించలేదనే కారణంతో సంక్రాంత్రి పండుగరోజున కొడవలితో తల్లీకూతుళ్లపై దాడి చేసి గాయపరిచిన విషయం విధితమే. ఈ కేసుకు సంబంధించి వెంకట కేశవ సుబ్రహ్మణ్యంను అరెస్ట్ చేసి భీమవరం కోర్టుకు తరలించినట్టు తెలిపారు. భీమవరంలోని రెండో అదనపు ఫస్ట్ మేజిస్ట్రేట్ వారు సుబ్రహ్మణ్యంకు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

3,930 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం వ్యానుతో అధికారులు

భీమడోలు, జనవరి 19 : ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని భీమడోలు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం పట్టుకున్నారు. చల్లచింతలపూడి, పంగిడిగూడెం గ్రామాల నుంచి సేకరించి వ్యానులో రాజమహేంద్రవరానికి తరలిస్తున్న రేషన్ బియ్యం లోడు వ్యానును అధికారులు స్వాధీన పర్చుకున్నారు. 3,930 కేజీల బియ్యాన్ని 64 బస్తాల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. బియ్యానికి సంబంధించిన యజమాని నీలాల భవానీప్రసాద్, డ్రైవర్‌లపై కేసు నమోదు చేశామని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాలికపై అత్యాచారం.. పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, జనవరి 19 : ఆడుకుంటున్న బాలికను డాబాపైకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడిన ఓ యువకుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరు పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఎస్.ఉమాసునంద శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఉంగుటూరులోని సుబ్బారాయుడుపేటకు చెందిన ఈదుపల్లి వెంకట దుర్గాసా యి(సాయి) (20) ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని పరిచయం చేసుకు ని ఫ్యాక్టరీలో ఉద్యోగం పొందాడు. అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటినుంచి తరచుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్తున్నాడు. 2018 ఆగస్టు 28వ తేదీ సాయంత్రం సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకుండా బాలిక ఆడుకుంటుంది. ఆ బాలికను డాబాపైకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన బాలిక తల్లి కేకలు వేయడంతో సాయి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ నాగ వెంకటరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో స్పెషల్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన ఈదుపల్లి వెంకట దుర్గాసాయిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమా నా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సహకరించిన నిడమర్రు సీఐ ఎం.సుబాష్, చేబ్రోలు ఎస్ఐ మణికుమార్, కోర్టు హెచ్‌సీ బి.ప్రసా ద్‌తో పాటు జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ వారిని ఎస్పీ అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఒక విద్యార్థినికి స్నేహితుడైన యువకుడు ఆమె ఫొటోలను అసభ్యకరంగా మార్చి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ మదీనాబాషా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతి(16)కు గతంలో ఏలూరులో చదివిన సమయంలో ఇరువాడ ఆనంద్ అనే యువకుడు స్నేహితుడు. అప్పట్లో వీరు ఒకరి ఫొటోలు ఒకరు వాట్సాప్ ద్వారా పంపుకున్నారు. ఆ తరువాత ఆ యువతి విశాఖపట్టణం ఉన్నత చదువులకు వెళ్లింది. ఇటీవల పండుగ సందర్భంగా ఏలూరు రావడంతో ఆమెతో మాట్లాడాలని ఏలూరు మినీ బైపాస్ రోడ్డు వద్దకు వచ్చి తాను చెప్పినట్లు చేయకపోతే ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మదీనాబాషా తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

విశాఖపట్నం(లీగల్), జనవరి 19: వృద్ధురాలిని కిరాతకంగా హత్యచేసి, బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ విశాఖ ఆరో అదనపు జిల్లా జడ్జి లాలం శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. ఏలూరుకు చెందిన గొల్లపల్లి నాగమల్లేశ్వరరావు(28)కు దొంగతనాలు చేయడం అలవాటు. దీనిలో భాగంగా 2014 జూలై 11న నగరంలోని ఆరిలోవలో నివశిస్తున్న వెదురుపాకల నూకాలమ్మ(65) ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు కాజేయాలని నిర్ణయించుకున్నాడు. ఎవరూలేని సమయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఆమె ఇంట్లోకి వెళ్లి నూకాలమ్మ పీకనొక్కి చంపి, ఆభరణాలు తస్కరించాడు. ఇంటికి వచ్చిన మృతురాలి కుమారుడు సూర్యనారాయణ జరిగిన ఘటనపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడ్ని అరెస్టుచేసి, ఆభరణాలు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రెస్టారెంట్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

జంగారెడ్డిగూడెం, జనవరి 19 :జంగారెడ్డిగూడెంలోని రెస్టారెంట్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహిం చారు. పట్టణంలోని తినేర మల్టీ క్యూజిన్ రెస్టారెంట్‌లో కృత్రిమ రంగులు కలుపుతున్నారని వచ్చిన సమాచారంతో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలిపినట్టుగా వచ్చిన అనుమానంతో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో వంద గ్రాముల తూకం గల 15 రకాల కృత్రిమ రంగుల డబ్బాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ విల్సన్, లీగల్ మెట్రాలజీ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమికి ఏదో చేయాలనే తపన

- ఇప్పటికి 11 చిత్రాలు పూర్తి చేశా : దర్శకుడు రాజా వన్నెంరెడ్డి



ఉండి, జనవరి 19:'జన్మభూమికి ఏదో చేయాలనే తపనతోనే ప్రతి ఏటా స్వగ్రామం చిలుకూరు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటా. ఆడపడుచుగా పిలుచుకునే పైడమ్మ ఆలయాన్ని తానే నిర్మించా.. అమ్మవారి ఆశీర్వదాలతోనే సినిమాల షూటింగ్ చేపడతా' అని దర్శకుడు రాజా వన్నెంరెడ్డి అన్నారు. శుక్రవారం చిలుకూరులో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తీసిన పదకొండు చిత్రాల్లో పలు చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 1986లో ఇండస్ట్రీకి వెళ్లాను, తనకు ఎంతోమంది సహకారం అందించారు. క్షేమంగా వెళ్లి లాభంగా రండి, చూసొద్దాం రండీ, అక్కాబావెక్కాడ, మీఇంటికి వస్తే ఏమిస్తారు మా ఇంటికి వస్తే ఏంతెస్తారు, ఆదివారం ఆడవాళ్లకు సెలవు, మా ఆయన చంటిపిల్లోడు, దొంగ చచ్చినోళ్లు, తెలుగు అమ్మాయి, లవ్ డాట్ కమ్, టామీ, ప్రశ్నిస్తా ! తదితర సినిమాలు తీశానన్నారు. మార్చి నెలలో ఒక సినిమా తీస్తున్నాను. అంతా కొత్త వాళ్లతో మంచి ట్రెండ్ కలిగిన సినిమాను తీస్తున్నానన్నారు. ఏప్రిల్ నుంచి పరమానందయ్య శిష్యుల కథ వెబ్ సిరీస్ ప్లస్ తీస్తున్నానన్నారు.

సామాజిక స్పృహ పెంచేలా సినిమాలు తీస్తా

- సినీ దర్శకుడు తేజ మార్ని



లలితా రాజరాజేశ్వరి దేవి పీఠాన్ని దర్శించుకున్న దర్శకుడు తేజ

తణుకు, జనవరి19 : సామాజిక స్పృహ పెంపొందించే చిత్రాలు తీయాలని అనుకుంటున్నట్టు సినీ దర్శకుడు తేజ మార్ని తెలిపారు. శుక్రవారం పైడిపర్రులోని శ్రీలలితా రాజరాజేశ్వరి అమ్మవారి పీఠాన్ని దర్శించుకున్నారు. అమ్మవారి దేవి ఉపాసకులు పొన్నపోలు సుధీర్‌శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం పట్ల యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. జోహార్, అర్జున ఫాల్గుణ చిత్రాలతో పాటు కోట బొమ్మాళి పీఎస్ చిత్రంద్వారా విజయం అందిపుచ్చుకున్నట్టు తెలిపారు. త్వరలోనే పెద్ద హీరోతో చిత్రం చేస్తామని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తానన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వివేక్‌ఠాకూర్

కేంద్ర పథకాల అమల్లో ఏలూరు జిల్లా భేష్

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వివేక్‌ఠాకూర్

ఏలూరు కలెక్టరేట్/లింగపాలెం, జనవరి 19: కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో, వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమ నిర్వహణలో ఏలూరు జిల్లా పనితీరు బేషుగ్గా ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వివేక్‌ఠాకూర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం భారత్ సంకల్పయాత్ర, కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కార్యక్రమాల అమలు తీరును కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జేసీ లావణ్యవేణి, అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కేంద్రం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టిందని అందరికి అన్ని పథకాలు లబ్ధిచేకూరేలా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదన్నారు. జిల్లాలో కార్యక్రమం చేపట్టకముందు, తరువాత సంబంధిత అంశాల్లో ప్రగతితీరును నివేదిక అందజేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న 17 ప్రధాన పథకాల ప్రగతిని వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, డీఈవో శ్యామ్‌సుందర్, అధికారులు పాల్గొన్నారు.

● లింగపాలెం మండలం భోగోలు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పలు విషయాల్లో ఆధునిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లాలన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, సర్పంచ్ తాడేపల్లి శాంతారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు జానల పుంగనూరు చిట్టి ఆవు



పెనుమంట్ర, జనవరి 19 : పాడిపంటలతో పాటు పశువుల పెంపకంపై ఆసక్తి గల మార్టేరుకు చెందిన సత్తి వెంకటరెడ్డి పుంగనూరు ఆవులు పెంచుతునానడు. పుంగనూరు ఆవు సూడిది కావడంతో రెండు రోజుల క్రితం చిట్టి పుంగనూరు ఆవు జన్మించింది మూడు జానల ఎత్తు కలిగిన పుంగనూరు చిట్టి ఆవును చూసేందుకు గ్రామానికి చెందిన సత్తి వెంకటరెడ్డి పశువుల పాక జగన్నాథపురం ఆయకట్టు పరిధిలో ఉంది. అక్కడకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఆవుతో పలువురు సెల్ఫీలు దిగుతున్నారు. ఈ పశువుల పాకలో ఆవులతో పాటు పుంగనూరు ఆవు, కపిలి ఆవును పెంచుతున్నాడు. ఈ ఆవులను చూసి పశుప్రేమికులు ఎంతగానో మురిసిపోతున్నారు.

పట్టువీడని అంగన్‌వాడీలు

39వ రోజు ఆందోళనలో అంబేడ్కర్ విగ్రహాలకు వినతి






భీమవరం.. ఆకివీడు.. గణపవరంలలో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాల వద్ద అంగన్‌వాడీల ఆందోళన... మొగల్తూరులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

పెనుగొండ/ఆచంట/నరసాపురం టౌన్/పెనుమంట్ర/గణపవరం/ఆకివీడు/భీమవరం అర్బన్/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/పాలకోడేరు/ఉండి/మొగల్తూరు/వీరవాసరం, జనవరి 19: పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన కొనసాగించారు. ఆచంటలో అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం నాటికి 29వ రోజుకు చేరింది. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్ మద్దతు తెలిపారు. నరసాపురంలో అంగన్‌వాడీల దీక్ష 39వ రోజుకు చేరింది. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పెనుమంట్రలో అంగన్‌వాడీలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామంలో అంగన్‌వాడీలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆకివీడులో సమ్మె శిబిరం వద్ద అంబేడ్కర్ ఫొటోకు, మెయిన్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరంలో 39వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక న్యాయం అంటూ అంబేడ్కర్ విగ్రహాలు పెడుతున్నారని, కాని ఆయన ఆశయాలను కూడా అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పెంటపాడులో అంగన్వాడీల దీక్షలు శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరాయి. శిబిరం వద్ద డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాలకోడేరులో అంగన్‌వాడీలు అంబేడ్కర్ చిత్రపటం వద్ద రాజ్యాంగ బద్ధమైన హక్కులు గురించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంగన్‌వాడీ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఉండి తహసీల్దారు కార్యలయం వద్ద అంగన్‌వాడీల దీక్షలు 39వ రోజుకు చేరాయి. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.






నరసాపురం.. పెంటపాడు.. పెనుగొండ.. పెనుమంట్రలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

దానేశ్వరమ్మ ఆలయ వార్షికోత్సవం



చలివిడి, పానకాలతో వస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) దానేశ్వరమ్మ

ఆకివీడు, జనవరి 19: కాపవరంరోడ్‌లో దానేశ్వరమ్మ ఆలయ 24వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మాదివాడ గంగానమ్మ దేవాలయం నుంచి పుట్టినిల్లు, మెట్టినిల్లు వారు చలువబట్టపై నడుచుకుంటూ చలివిడి పానకాలు, చీర సారెలతో వచ్చి దానేశ్వరమ్మ దేవాలయంలో అందజేశారు. వచ్చే మంగళవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయి. కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ బండారు జల దుర్గా ప్రసాదరావు, సెక్రటరీ జంగారెడ్డి రఘు రామిరెడ్డి, అర్చకులు మొవ్వ దుర్గా నాగ చంద్రధర శర్మ పాల్గొన్నారు.

పాశాలమ్మ జాతర



కోలమూరులో మండోధర అమ్మవారికి ఎమ్మెల్యే రామరాజు పూజలు

ఉండి, జనవరి 19: పాముల పర్రులోని పాశాలమ్మ జాతరలో ఎమ్మెల్యే రామరాజు, జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు విచ్చేసి అమ్మవారిని పూజించా రు. డప్పు వాయిద్యాలను వాయి ంచి అందరిని ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే రామరాజు, నాగరాజు లను సర్పంచ్ కేశన శాంతకుమారి బలుసులురావు దంపతులు సన్మానించారు.

కోలమూరులోని మండోధర అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే రామరాజు, జుత్తుగ నాగరాజు పూజలు చేశారు. అమ్మవార్ల ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని కార్యక్రమం జరిగింది, కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పేరిచర్ల బాలరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

రేపు వీరవాసరంలో జర్నలిస్టుల జిల్లా కమిటీ ఎన్నిక

ఆచంట, జనవరి 19:ఈ నెల 21న వీరవాసరంలో జరిగే ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఎన్నికల నిర్వహణ నామినేషన్‌ల పక్రియకు సంబంధించి విధి విధానాలపై శుక్రవారం ఆచంటలోని నియోజకవర్గస్థాయి విలేకరుల సమావేశం కేవీవీ తాతారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పరిశీలకులుగా పాల్గొన్న ముత్యాల శ్రీనివాస్, పీటీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ప్రెస్ సభ్యుల ఎన్నిక విధానాన్ని వివరించారు. సమావేశం అనంతరం నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే కమిటి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడుగా గుర్రాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దిద్దేసుకుమార్, కోశాధికారిగా ముత్యాల షణ్ముఖ్, ఉపాధ్యక్షులుగా కొట్టిరామం, జవ్వాది మోహన్, సహాయ కార్యదర్శులుగా తానేటి శేఖర్, వనం సత్యనారాయణ, తోపాటు ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

శేషమ్మచెరువులో వికసిత సంకల్ప యాత్ర



వికసిత భారత్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆచంట, జనవరి 19: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం శేషమ్మచెరువులో కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ వరప్రసాద్, మండల బీజేపీ అధ్యక్షుడు నాగ సుబ్బారావు, సర్పంచ్ జె.శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నరసాపురం రూరల్, జనవరి 19: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ఎంపీపీ సోని అధ్యక్షతన ఉదయం 10గంటలకు ఈసమావేశం జరుగుతుందన్నారు.

ఈవీఎంలపై ఆర్టీసీ కార్మికులకు అవగాహన



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జనవరి 19 : ప్రతి ఒక్కరు ఈవీఎం మిషన్‌లపై ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. డిపో గ్యారేజ్‌లో రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డమ్మి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, హరిగోపాల్, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

22న శోభాయాత్ర

భీమవరం టౌన్, జనవరి 19 :ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న పురాతన శ్రీరాముడి ఆలయం నుంచి శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు తెలిపారు. ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ శోభాయాత్ర అనంతరం ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో స్వామివారి కల్యాణం, ఆంజనేయ స్వామి తమలపాకుల అర్చన, భజన కోలాటం నిర్వహిస్తామని తెలిపారు.

పౌష్టికాహారం అందజేత

భీమవరం అర్బన్, జనవరి 19 : స్వేచ్ఛ మహిళా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు న్యూట్రీషన్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను విచ్చేశారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంఘం సేవకులు అల్లు శ్రీనివాస్, మహిళ సంఘం అధ్యక్షులు ఎం. ధర్మవతి, నీలిమ, ఎ.రమణ, వై.గౌరి, సీహెచ్ స్వాతి, వై.లక్ష్మి, డి.వరలక్ష్మి, పాజిటివ్ పీపుల్ సొసైటీ కార్యదర్శి కముజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలకు అండగా ఉండే పార్టీలకే మద్దతు



ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

పాలకోడేరు, జనవరి 19 : బీసీలకు అండగా ఉండే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. పెన్నాడలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం బీసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పాలకోడేరు మండల బీసీ అధ్యక్షుడు దొమ్మేటి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనాభా నిష్పత్తిని బట్టి సీట్లు కేటాయించాలన్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నాలుగు ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు బీసీలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి చింతాడ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్, కుక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఛలో విజయవాడ

భీమవరం రూరల్, జనవరి 19 : డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విజయవాడ నగర నడిబొడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అంబేడ్కర్ అభిమానులకు పండుగ అని విద్యావేత్త మేడి జాన్సన్ అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగే విగ్రహావిష్కరణలో పాల్గొనడానికి ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం బాగస్వామ్యులైనట్లు డా.ఎ.వీరయ్య తెలిపారు. డా.ఎన్ విజయ్‌కుమార్, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజబాబు, కోశాధికారి డా.ఎపీఎస్ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు జాతి ఘన కీర్తి యోగి వేమన: కలెక్టర్

భీమవరం, జనవరి 19 : తెలుగు జాతిని, తెలుగువారి కీర్తిని దశదిశలా తీసుకెళ్లిన మహాకవి యోగి వేమన అని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. యోగి వేమన జయంతి పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో కలెక్టర్ పాల్గొని, యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల జీవన ప్రమాణాలను తన పద్య రూపంలో రచించి ప్రజా కవిగా గుర్తింపబడ్డారని పేర్కొన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగు వారు ఉండరని అన్నారు. వేమన కవి రచించిన పద్యాలకు ఉన్న ప్రజాదరణ మాటల్లో చెప్పలేమన్నారు. జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలి: జేసీ

భీమవరం, జనవరి 19: ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు బాధ్యతతో పూర్తి చెయ్యాలని అధికారులను జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి రీ సర్వే స్టోన్ ప్లాంటేషన్, ధాన్యం కొనుగోలు, సివిల్ సప్లై, సర్వే - యఫ్ లైన్, సబ్ డివిజన్ తదితర ఆరు అంశాలపై శుక్రవారంజిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆచంట, పాలకొల్లు, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి మండలాల రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా గోనె సంచులు కొరత రాకుండా ప్రతి రైతు భరోసా కేంద్రంలో తగినన్ని నిల్వలు పెట్టుకోవాలన్నారు. రీ సర్వే జరుగు తున్న గ్రామాలు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లై గొడౌన్స్ క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని రిజిస్టర్లు ప్రకారం స్టాకును పరిశీలన చేసుకుని నివేదికలు అందజేయ్యాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, కె.చెన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లిఖార్జున రావు, డీఎస్‌వో ఎస్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఏఎస్‌వో ఎం.రవి శంకర్, జిల్లా కలెక్టరు కార్యాలయం ఏవో వైకేవీ అప్పారావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను వంచించిన జగన్: వలవల



ఐక్యతను చాటుతున్న టీడీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 19: అన్ని వర్గాల ప్రజలను వంచించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శుక్రవారం జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీసీల్లోని అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎన్నికల్లో బీసీలంతా టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19: సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి అన్నారు. ఆరుగొలనులో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి వట్టూరి రాంబాబు, మద్దుకూరి ధనరాజు, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో బీజేపీ స్వచ్ఛభారత్

తణుకు, జనవరి 19: ఆలయాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించాలన్న ప్రధాని పిలుపు మేరకు శుక్రవారం తణుకు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని శుభ్రపరచినట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. నాయకులు కొవ్వూరి వెంకట రెడ్డి, పెదమల్లు అవినాష్ కాంత్, కిరణ్మయి, రామారావు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

తణుకు, జనవరి 19: భూహక్కు చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని మహిళా న్యాయవాది కలిదిండి పద్మావతి అన్నారు. తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం రిలే దీక్షలు కొనసాగించారు. న్యాయవాదులు అప్పాజీ, రామకృష్ణ, మృత్యుంజయరావు, ప్రతాప్‌కుమార్, దనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి న్యూరోసర్జన్ రాక

పెంటపాడు, జనవరి 19: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 21న విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ (నరాలకు సంబంధించిన) డాక్టర్ తీగల రమేష్ వస్తున్నారని ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. అలాగే ప్రతి శని, ఆదివారం ఆసుపత్రి వద్ద ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, అతి తక్కువ ధరలో కళ్ళజోళ్ళు ఇస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం క్రైం, జనవరి 19 : కోర్టు క్యాలెండర్‌తో న్యాయవాదులు కోర్టు సిబ్బంది, కక్షిదారులు, పోలీసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఐఏఎల్ ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ రూపొందించిన ఈ క్యాలెండర్‌ను శుక్రవారం నాడు భీమవరంలో ఆవిష్కరించారు. సమితి సభ్యులు వైవీ ఆనంద్, ఎస్.మాణిక్యాలరావు, సాగర్, నాగరాజు పాల్గొన్నారు.

'వెంపటాపు'కు అంతర్జాతీయ అవార్డు



వెంపటాపు చిత్రించిన ఐయామ్ నాట్ వితౌట్ ట్రీ



చిత్రకారుడు డా.వెంపటాపు

తణుకు, జనవరి 19: తనకు అంతర్జాతీయ కళామణి గ్లోబల్ అవార్డు లభించిందని తణుకు బాలుర ఉన్నత పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు డాక్టర్ వెంపటాపు తెలిపారు. ఇటీవల ఢిల్లీకి చెందిన క్రియేషన్స్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీల్లో తాను చిత్రించిన 'ఐ యామ్ నాట్ విత్‌ఔట్ ట్రీ' పెయింటింగ్‌కు అవార్డు దక్కినట్లు తెలిపారు. హెచ్‌ఎం పద్మావతి, సిబ్బంది తదితరులు అభినందించారు.

రూ.32కోట్ల 79లక్షలు చెల్లించాలి

'ఆంధ్రజ్యోతి' వార్తకు పౌరసఫరాల శాఖ స్పందన

భీమవరం జనవరి 19 : జిల్లాలో రైతులకు ధాన్యం బకాయిలు చెల్లింపులో జాప్యం జరుగు తుందని... పండగ వెళ్లిపోయినా సొమ్ము లేవి? అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. 27 రోజుల లకు ముందుగా సొమ్ములు చెల్లించామని, ఈ వారం పది రోజుల్లో మాత్రమే రూ.32.79 కోట్లు ఇంకా చెల్లించవలసి ఉందని తెలిపారు. మొదటి నుంచి సొమ్ములను వేగంగా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.



కళాకారిణులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

ఆకట్టుకున్న కూచిపూడి, జానపద నృత్యాలు

భీమవరం టౌన్, జనవరి 19 : మావుళ్ళమ్మ అమ్మవారి 60 వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాట్యాచారిణి ప్రభావతి పైడిరాజు నిర్వహణలో సాగిన కూచిపూడి జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దాదాపు మూడు గంటలపాటు జనపదాలపాటలకు అనుగుణంగా చిన్నారులు నృత్యాలు చేసి మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం కళాకారులను నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ(సత్తి బాబు) సత్కరించారు. రాత్రి 7గంటలకు భీమవరానికిచెందిన వెంకిఆర్కెస్ట్రా వారిచే సినీ మ్యూజికల్ నైట్‌లో గాయకులు పాత, కొత్త కలయిక పాటలు పాడి ఖైమరపించారు.

నేడు మావుళ్ళమ్మ ఉత్సవాల్లో..

మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమల తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు పాలకొల్లు వారిచే కోలాటం, మధ్యాహ్నం 2గంటలకు తీపర్రుకు చెందిన కళ్యాణ వెంకటేశ్వర గాన మిత్ర భజన మండలి వారిచే భజన, సాయంత్రం 4గంటలకు విజయవాడకు చెందిన పీవీపీ ప్రసాద్‌చే భక్తి పాటలు, సాయంత్రం 5గంటలకు భీమవరానికి చెందిన మావుళ్ళమ్మ, సూర్యోదయ ఆర్ట్స్‌వారిచే విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నాటకం, రాత్రి 8 గంటలకు హైదారాబాద్‌కు చెందిన శ్రీకృష్ణస్వర రాగ ప్రవంతి సభ్యులచే సినీ మ్యూజికల్ నైట్ ఉంటాయి.

గ్రామ వికాసానికి మోదీ కృషి

పెనుమంట్ర, జనవరి 19 : ప్రధాని నరేంద్ర మోదీ గ్రామ వికాసానికి బాటలు వేశారని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం పొలమూరు గ్రామంలో వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామాలలో అమలు జరుగుతున్న పథకాలు గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించుకుంటూ జగన్ ఫొటోలు ముద్రించుకుంటున్నారని విమర్శించారు. .కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, ఎంపీటీసీ పిచ్చెట్టి నరసింహ మూర్తి, మాచిరెడ్డి లక్ష్మీ దుర్గ పార్టీ ఆచంట అసెంబ్లీ కన్వీనర్ కేహెచ్‌వీ ప్రసాద్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి పద్మజ, గ్రామ కార్యదర్శి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు

రెండు రోజులుగా సెల్‌టవర్ పైనే..

భీమవరం క్రైం, జనవరి 19 : పట్టణంలోని బ్యాంక్ నుంచి రావల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ, తనను పట్టించుకోవడం లేదంటూ లోకం ఏసు అనే వ్యక్తి గురువారం ఉదయం సెల్‌టవర్ ఎక్కిన విషయం తెల్సిందే. అయితే రెండవ రోజు శుక్రవారం కూడా సెల్‌టవర్‌పైనే ఏసు నిరసన తెలిపాడు. శుక్రవారం రాత్రి వరకు కూడా అతను సెల్ టవర్ దిగలేదు. పోలీసులు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. అతనితో సెల్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా కూడా టవర్ దిగడం లేదు. గతంలో కూడా సెల్‌టవర్ ఎక్కిన అతను న్యాయం చేస్తామని చెయ్యలేదని వాపోయాడు.

హత్యాయత్నం కేసు నమోదు

భీమవరం క్రైం, జనవరి 19 : ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేస్తుండగా ఈ స్థలం నాదంటూ తనపై యర్రగోపు వెంకటేశ్వరరావు పెట్రోలు పోసినట్లు ఎక్స్‌కవేటర్ డ్రైవర్ పితాని అయ్యప్ప ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు. భీమవరం ఒకటో పట్టణంలోని సుంకర పద్దయ్యవీధిలో జయరాం అనే వ్యక్తికి చెందిన స్థలాన్ని చదును చేస్తుండగా ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితుడు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. హత్యాయత్నంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందజేత



భీమవరం టౌన్, జనవరి 19 : మావుళ్ళమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన వేగేశ్న శ్రీరంగ రాజు (శ్రీహరి) 8 గ్రాముల బంగారాన్ని అందజేశారు. ఆలయానికి వచ్చిన దాత ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం బంగారాన్ని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీకి అందించారు. దాతలకు అమ్మవారి ప్రసాదాన్ని శేషవస్త్రాన్ని అందించారు.

అన్న సమారాధన

మొగల్తూరు, జనవరి 19: నడివీధి ముత్యాలమ్మ జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు కారుమూరి మోహన్, గునిశెట్టి నర్సింహమూర్తి, గుండు రామకుమార్, గుండు నాగేంద్ర, కాసాని బాలు, సఖినేటిపల్లి నర్సింహమూర్తి, కారుమూరి శ్రీకాంత్, కుష్వంత్, మహిళలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాబుతోనే రాష్ట్రం అభివృద్ధి



బాబూ షూరిటీ బాండ్లు అందిస్తున్న టీడీపీ నాయకులు

మొగల్తూరు, జనవరి 19: తెలుగు దేశం అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కలిదిండి కుమార్ బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు డొల్లా రత్నంరాజు, బొల్లా చంటి అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెంలో భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వారు ఇంటింటా తిరిగి భవిష్యత్‌కు బాబు గ్యారంటీ బాండ్‌లు పంపిణీ చేశారు. చల్లా తాతాజీ, తోరం వెంకటేశ్వరరావు, పులపర్తి బాంబు పాల్గొన్నారు.

వ్యాస రచన విజేతలకు బహుమతులు

భీమవరం, జనవరి 19: విజయవాడలో డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం బహుమతులు అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ తోపాటు జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవాడకు తరలిన వైసీపీ శ్రేణులు



విజయవాడకు బస్సులు ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

ఆచంట, జనవరి 19: విజయవాడలో శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి వైసీపీ శ్రేణులు వాహనాల్లో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో విజయవాడ వెళ్లారు. వెళిన వారిలో ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, పలువురు సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

నరసాపురం టౌన్: విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహా విష్కరణకు వెళుతున్న బస్సుల ర్యాలీని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రాధాకృష్ణ, జాన్‌కెనడి, కావలి నాని, దొంగ మురళీ, కాకిలేటి ఆనందకుమార్ పాల్గొన్నారు.

వీరవాసరం: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, సామాజిక సంకల్ప సభకు వీరవాసరం మండలం నుంచి తరలి వెళ్లారు. శుక్రవారం వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ గ్రామాల నుండి ప్రత్యేకంగా ఈ సభకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. రాయకుదురులో సర్పంచ్ గెడ్డం భారతి భాస్కరావు, వీరవాసరంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నూకల కనకారావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

సీసీ రహదారి పనుల ప్రారంభం

కాళ్ళ, జనవరి 19 : ప్రాతాళ్ళమెరక గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులను డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.40 లక్షలతో 175 మీ. పొడవున డబుల్ లైన్ సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెన్మెత్స విశ్వనాథరాజు, వేగేశ్న బాలగణపతివర్మ, సాగిరాజు హరివర్మ, కంతేటి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు

ఉండి, జనవరి 19: జగన్నన ఆరోగ్య సురక్షను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కొండవీటి సాంబశివరావు అన్నారు. శుక్రవారం చెరుకువాడలోని జగన్నన ఆరోగ్య సురక్ష రెండోవ విడత కార్యక్రమం జరిగింది. విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించినట్లు ఉండి ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.సాయిచంద్ర తెలిపారు.

కులగణన సర్వే పరిశీలన

ఉండి, జనవరి 19: చెరుకువాడలో కులగణన సర్వే తీరును ఎంపీడీవో ఎస్.రవీంద్ర పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కులగణనను చేపట్టిందన్నారు. ప్రతీ కుటుంబం ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ కొండలరావు, గ్రామకార్యదర్శి గోపాల కృష్ణమూర్తి, డాక్టర్ సాయిచంద్ర పాల్గొన్నారు.